క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



పరీక్షా కేంద్రంలో డిప్యూటీ డీఈఓ రాజగోపాల్

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో ఉన్న ఎస్‌పీబీవీడీ సభా హైస్కూల్‌ను బుధవారం డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సెమ్మెటివ్ అసెస్‌మెంట్ - 2 పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయుల రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి.మదుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెర్ల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి



పాలేటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

చిన్నమండెం : వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 14వ తేదీన రాయచోటి పట్టణంలో నిర్వహించబోయే వడ్డెర్ల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని పాలేటమ్మ ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో పర్యటించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20 శాతం ఓటర్లుగా ఉన్న రాజకీయంగా 2 శాతం కూడా ప్రాధాన్యత లేక ఓట్ల యంత్రాలుగా మిగిలిపోయామన్నారు. రాజకీయ పార్టీలకు కనువిప్పు జరిగేలా ఈ సమావేశాన్ని జయప్రదం చేద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, జీవానందం, చంద్రశేఖర్, రామారావు, శివప్రసాద్, నాగార్జున, వెంకటరమణ, రెడ్డయ్య, మారుతీశంకర్, శ్రీనివాసులు, శ్రీరాములు, రాంప్రసాద్, రామచంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో భక్తులకు అభయం ఇస్తున్న అమ్మవారు

నందలూరు(రాజంపేట) : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన శ్రీ మంచాలమ్మ గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి గ్రామోత్సవానికి బయలుదేరిన మంచాలమ్మ బుధవారం మధ్యాహ్నానికి ఆలయానికి చేరుకుంది. ఆడపూరు, రాచపల్లి, కొండాయపల్లె, హరిజనవాడ, మంత్రిపల్లె గ్రామాలలో గ్రామోత్సవం వైభవంగా కొనసాగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం ఆడపూరు గ్రామానికి చెందిన వెంకటమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇంజం రామచంద్ర నాయుడు, సర్పంచ్ నందలూరు భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మయ్య నాయుడు, గ్రావిటీ సుబ్బారెడ్డి, నాగిరెడ్డి సురేంద్ర రెడ్డి, నవీన్ రెడ్డి, నందలూరు శ్రీనివాసులు రెడ్డి, బాబు, బుజ్జయ్య నాయుడు, శ్రీనివాసరాజు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వత్తలూరు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పున్నాటి వారిపల్లెకు చెందిన పున్నాటి రఘురామిరెడ్డి (83) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు నందలూరు వెంకటసుబ్బారెడ్డి వైఎస్ఆర్ పార్టీ నాయకులు పున్నాటి ఈశ్వర్ రెడ్డి టంగుటూరి రాజశేఖర్ రెడ్డి మారే సుకుమార్ ఎంపీటీసీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ సమీపంలో బుధవారం సాయంత్రం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు తాను పోలీసు సిబ్బందితో వెళ్లి హెచ్‌పీసీఎల్ సమీపంలో ఉన్న పేకాట స్థావరంపై దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 10,500 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీదే



ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



ప్రభుత్వ విప్‌కు కర్పూర హారతులు పడుతున్న మహిళలు

- రాజుకుంట జనసందోహం నడుమ ఎన్నికల ప్రచారం
- ఇంటింటికి వెళ్లి ఓటు అభ్యర్థించిన ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

చిట్వేలి : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాజుకుంట పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి హాజరైన కొరముట్ల, నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామ నాయకులు మాధినేని లోకేష్, కనకరాజుల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఎమ్మెల్యే తదితర వైఎస్సార్‌సీపీ నాయకులకు బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. పంచాయతీలోని రాజుకుంట, చింతలచెలిక, అరుంధతివాడ, బీసీ కాలనీలలో ఇంటింటికి తిరిగి జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించి, రాష్ట్రంలో, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని తెలియజేశారు. అంతకుముందు అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చింతలచెలిక బీసీ కాలనీ, అరుంధతివాడలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా పాలన సాగించడమే నిదర్శనమన్నారు. అందువలన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికలలో రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని, రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొరముట్ల శ్రీనివాసులు ప్రజలను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్ సురేష్ బాబు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, హేమనవర్మ, టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, ఎల్‌వీ మోహన్ రెడ్డి, కొండూరు విజయ్, ఉమామహేశ్వర్ రెడ్డి, మందల నాగేంద్ర, చక్రపాణి, సుధాకర్ రాజు, లింగం లక్ష్మీకర్, ఎంపీపీ చంద్ర, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, రమేష్, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌లు సుబ్బరామరాజు, భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్ బాషా, మలిశెట్టి వెంకటరమణ, వెంకటరెడ్డి, బీకే మణి, గ్రామ నాయకులు ప్రసాద్, నారాయణ, సుబ్బరాయుడు, విజయ్, శితాంబరం, మల్లి తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్



శ్రీకాంత్ రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ అంటేనే క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన, నెల రోజులు కఠోర ఉపవాస దీక్షలు పాటించిన వారి శ్రమకు పరిపూర్ణ ఫలితం లభించే రోజున్నారు. పేదవాడి ఆకలి బాధలు తెలుసుకోవడమే ఉపవాసాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇదే మాసంలో పవిత్ర ఖురాన్ పవిత్ర గ్రంథం ఆవిష్కరించబడిందని చెప్పారు. ఈ పండుగను అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు.

మంచాలమ్మా.. చల్లంగా చూడమ్మా

రామాపురం : రాచపల్లె గ్రామం గంగనేరులో జరుగుతున్న మంచాలమ్మ జాతరలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు గావించి ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. రాచపల్లెలో క్షత్రియులు కట్టిన చాందినీ బండిని ఆయన సందర్శించారు. గంగనేరులో ముమ్మసాని మహేశ్వరరెడ్డి, రాచపల్లెలో పోస్టుమాస్టర్ రాజులు తిరునాల సందర్భంగా ఇచ్చిన విందులో ఆయన పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్

గాలివీడు : శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్ అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముందస్తు ఏర్పాటు చేసుకుంటున్నారు. మండలంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలి నుంచి బస్టాండు వరకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సాగేలా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నాకాబందీ నిర్వహించిన పోలీసులు కీలక పాయింట్లపై పెట్టి తనిఖీలు ముమ్మరం చేశారు.



మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

సమష్టి కృషితోనే జాతర విజయవంతం

బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణపై సిబ్బందికి సీఐ మద్దయ్యఆచారి దిశానిర్దేశం

రాజంపేట టౌన్ : గంగమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులందరూ సమష్టిగా పనిచేయాలని అర్బన్ సీఐ మద్దయ్యఆచారి తెలిపారు. జాతర సందర్భంగా విధులు నిర్వర్తించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులకు సీఐ బుధవారం రాత్రి బలిజపల్లె గ్రామంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తారని, అందువల్ల భక్తులందరూ అమ్మవారిని దర్శించుకోవాలన్న ఆత్రుతతో ఉంటారన్నారు. ఈ సమయంలో పోలీసులు ఓర్పు, సహనం వహించి సమన్వయంతో భక్తులకు వీలైనంత త్వరగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. క్యూలైన్‌లో తోపులాటలు లేకుండా చూడాలన్నారు. క్యూలైన్ ద్వారా అమ్మవారి గుడి వద్దకు వచ్చే సమయంలో భక్తులు ఒకరినొకరు తోసుకునే పరిస్థితులు ఉంటాయన్నారు. అందువల్ల గుడి వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కొంతమంది అమ్మవారికి ఎదురుగా ఎక్కువ సేపు నిల్చుని దర్శించుకోవాలనుకుంటారని, అలాంటి వారిని సున్నితంగా ముందుకు పంపాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సహకరించి వారికి ఇబ్బంది లేకుండా గంగమ్మను దర్శింప జేయించాలని తెలిపారు. వాహనాలను ఎట్టిపరిస్థితుల్లో జాతరలోకి అనుమతించకూడదన్నారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను పెట్టుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. చైన్‌స్నాచర్స్, పిక్‌ప్యాకెటర్స్ పట్ల క్రైం బ్రాంచ్ పోలీసులు కన్నేసి ఉంచాలన్నారు. గంగమ్మను శుక్రవారం పొలిమేర్లకు పంపే వరకు పోలీసులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించి, జాతరను విజయవంతం చేయాలన్నారు.



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న సీఐ మద్దయ్యఆచారి

ఆంగ్లంలో ప్రతిభ వెలికితీసేందుకే 'టోఫెల్'

సంబేపల్లె : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఇంగ్లిష్‌లో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు, వారి ప్రతిభను వెలికితీసేందుకు టోఫెల్ పరీక్ష తోడ్పడుతుందని సంబేపల్లె జెడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖ గౌరవ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, గౌరవ కమిషనర్ సురేష్‌కుమార్ ఇచ్చిన ఆదేశాల మేరకు బుధవారం ఉదయం పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులకు వినడం, చదవడం, రాయడం నైపుణ్యాలను అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ వారిచే (ఈటీఎస్) నిర్వహించే టోఫెల్ ప్రాథమిక స్థాయి పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష నిర్వహణకు పాఠశాలలోని ఐఎఫ్‌పీ ఫ్యానెల్‌ను, ఎస్సీఈఆర్టీ వారు జారీ చేసిన ప్రింటెడ్ ప్రశ్నాపత్రాలను ఉపయోగించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ దేశాలలో ఇంగ్లిష్ మాట్లాడే తీరును, యాసను అర్థం చేసుకొని తిరిగి జవాబు ఇచ్చేందుకు విద్యార్థులు ఆంగ్లంలో చక్కగా మాట్లాడేలా తర్ఫీదు ఇవ్వడానికి టోఫెల్ శిక్షణను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా అడుగులు పడుతున్నాయన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఆత్మవిశ్వాసంతో పోటీ పరీక్షల్లో రాణించేలా చిన్ననాటి నుంచే టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజీ) పరీక్షకు సిద్ధం చేయాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. బుధవారం 3, 4, 5 తరగతులకు నిర్వహించిన టోఫెల్ ప్రాథమికస్థాయి పరీక్షతోపాటు ఈనెల 12వ తేదీన 6, 7, 8 తరగతుల విద్యార్థులకు వినడం, చదవడం, రాయడంతోపాటు మాట్లాడడం పైన కూడా టోఫెల్ జూనియర్ స్థాయి పరీక్షను నిర్వహిస్తామన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అమెరికాకు చెందిన ఈటీఎస్ నుంచి టోఫెల్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు దేవప్రసాద్ రెడ్డి, విజయభాస్కర్, జోసెఫ్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఓబుల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

వైభవంగా పల్లమ్మ తల్లి జాతర



పూజలందుకున్న పల్లమ్మ



ఓసూరమ్మకు పొంగుబాళ్లు తీసుకువస్తున్న ప్రజలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ చెయ్యేరు నది ఒడ్డున వెలసిన పల్లమ్మ జాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పండుగ మరుసటి దినం అమ్మవారి జాతర చేయడం ఆనవాయితీ. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అమ్మవారికి పొంగుబాళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. పందేరపు బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశాయి. ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఈటమాపురం ఓసూరమ్మకు పొంగళ్లు..

మండలంలోని ఈటమాపురం గ్రామంలో ఓసూరమ్మకు బుధవారం ఉదయం పొంగుబాళ్లు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు మేళతాళాలతో ఓసూరమ్మ ఆలయానికి వచ్చి పొంగుబాళ్లు పొంగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఓసూరమ్మ దేవాలయాన్ని సోమశిల ముంపువాసులు నిర్మించి ప్రత్యేకంగా ప్రతి ఏడాది తిరునాల చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు రూరల్ : రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్. ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న న్యాయవాదుల బీమా రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడానికి కృషి చేస్తామన్నారు. జిల్లా పునర్విభజనతో పీలేరు కోర్టు నుంచి నాలుగు మండలాలు వేరే కోర్టుకు పోతున్నాయని, వాటి స్థానంలో మన కోర్టుకు నాలుగు మండలాలు కొత్తగా చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

రాయచోటి అర్బన్ : ఈద్ - ఉల్ - ఫితర్ (రంజాన్ ముగింపు) ప్రార్థనలకు విచ్చేసే ముస్లిం, మైనార్టీ సోదరులకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని ఈద్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్ ఖాన్ అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డిని కోరారు. ఈదుల్ ఫితర్ ప్రార్థనలకు సంబంధించి మాండవ్యనది ఒడ్డున ఉన్న జమాలుల్లాబాషా ఈద్గా, పాత రాయచోటి ఈద్గాలలో జరుగుతున్న ఏర్పాట్లను అర్బన్ సీఐ పోలీసు సిబ్బందితో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జమాలుల్లాబాషా ఈద్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఖాన్ అర్బన్ సీఐను కలుసుకుని ప్రార్థనకు విచ్చేసే ముస్లిం, మైనార్టీలు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. మైనార్టీలు ఈద్గాకు విచ్చేసే రహదారుల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడటంతోపాటు తగు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈద్గా వద్ద వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐ స్పందిస్తూ ప్రార్థనలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎండల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించారు. ఇదే సమయంలో మారోవైపు మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, మున్సిపల్ అధికారులు రంజాన్ ప్రార్థన ఏర్పాట్లను పరిశీలించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుధ్య ఏర్పాట్లతోపాటు తాగునీటి వసతిని కూడా కల్పించాలంటూ కమిషనర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, వైఎస్ఆర్‌సీపీ నేతలు బేపారి జబివుల్లాఖాన్, అజ్మత్ తోపాటు పలువురు మైనార్టీ యువకులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: ఈద్గా కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి



పుల్లంపేట: అప్పారాజుపేటలో ఈద్గా విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేసిన దృశ్యం

ముస్తాబైన ఈద్గా

పుల్లంపేట : రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని ఈద్గాతో సహా అప్పారాజుపేట, మల్లువారిపల్లె, కాదర్‌పేట, దళవాయిపల్లి తదితర గ్రామాలలోని ఈద్గాలను ప్రార్థనలకు సిద్ధం చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభంకానున్నట్లు ముస్లిం మత గురువులు తెలియజేశారు.

వడదెబ్బపై విస్తృతంగా అవగాహన

డీఎంహెచ్‌ఓ కొండయ్య

కేవీపల్లె : ఎండలు మండుతుండడంతో ప్రజలకు వడదెబ్బపై విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. బుధవారం మండలంలోని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ పరిధిలోని మార్రేళ్లలో నిర్వహించిన కుటుంబ వైద్యుల విధానం కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ అన్ని ముఖ్య ప్రదేశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మంచాలమ్మ జాతర

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయతీలో గంగనేరు క్వాటర్స్ సమీపంలో వెలసిన శ్రీ మంచాలమ్మ జాతర బుధ, గురువారం రోజులలో జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని బుధవారం ఉదయం ఆలయంలోకి తీసుకువస్తారు. అనంతరం మొక్కుబడులు ఉన్నవారు, సంతానం కావలసినవారు ఆలయం వద్ద ఒరపడి తమ కోరికలు తీర్చుకుంటారు. ఉదయం నుంచి మంచాలమ్మ తల్లికి భక్తులు అధిక సంఖ్యలోని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి చాందినీ బండ్లు ఆలయం చుట్టూ తిప్పుతారు. గురువారం ఉదయం నుంచి గ్రామాలలో మొక్కుబడులు ఉన్న భక్తులు మొక్కుబడులు చెల్లించుకుంటారు. సాయంత్రం చెక్కభజనలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ జాతరకు మండలంలో నుంచే కాకుండా ఇతర జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

రాయచోటి అర్బన్ : గర్భిణులు వైద్యుల సలహాలను పాటించాలని జిల్లా మాస్ మీడియా అధికారిణి దేవశిరోమణి అన్నారు. బుధవారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృవందన యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా వైద్యశాలలో వైద్యపరీక్షలు, చికిత్సలతోపాటు గర్భిణులు తీసుకోవలసిన ఆహారం, వ్యాయామం, నిద్ర మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా లింగ నిష్పత్తి చాలా తక్కువగా ఉందన్నారు. సృష్టిలో స్త్రీ, పురుషులు ఇరువురు సమానులన్నారు. ఈ విషయాలను ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న కుటుంబాలు, స్నేహితుల కుటుంబాలకు తెలియజేయాలంటూ కోరారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుని వడదెబ్బ నుంచి పసిపిల్లలు, గర్భిణీ స్త్రీలు, చిన్నబిడ్డలు, ముసలివారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కువగా తాగునీటిని సేవిస్తూ డీ హైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్త పడాలంటూ సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుగుణ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది విశ్వనాథరెడ్డి, కవిత, ఖాదర్‌వలీ, ఆశ వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.



గర్భిణులకు సూచనలు చేస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారిణి దేవశిరోమణి

మేలు రకం వంగడాలను ఎంచుకోవాలి

రాయచోటి టౌన్ : మేలు రకం వంగడాలను ఎంచుకొని సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ డిప్యూటీ ఏఎస్‌వో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దిగువ అబ్బవరం గ్రామంలో ఓడివీడు గ్రామానికి చెందిన రైతు రఫీ సాగు చేసిన వేరుశనగ పంటను పంటకోత నిర్వహించారు. ఐదు మీటర్లకు ఐదు మీటర్ల విస్తీర్ణంలో పంట కోతను చేశారు. 20.550 కిలోల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఈ దిగుబడి ప్రకారం ఎకరానికి సుమారు 44 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి లభిస్తుందని తెలిపారు. ఈ రకం వేరుశనగకాయలు ఆయిల్, టేబుల్ వాడకానికి ఉపయోగిస్తారన్నారు. ఈ రకం వేరుశనగ పంట రాయచోటి ప్రాంతంలో కొత్తగా సాగుచేశారని మంచి దిగుబడి లభించడంతో ఈ ప్రాంతంలోని రైతులు ఎక్కువ మొగ్గు చూపే అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటిస్తూ వ్యవసాయం చేస్తే మంచి దిగుబడి లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోషమ్మ, వీఏఏ నవీన్ రెడ్డి, ఎంపీఈఓ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.



పంటకోత కోసం కొలతలు తీసుకుంటున్న వ్యవసాయ అధికారులు

మనోభావాలు దెబ్బతీసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

రైల్వేకోడూరు అర్బన్ : జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి తన బయోడేటాను పంపినందుకు బీదం నవీన్ అనే వ్యక్తి తనపై దూషణలకు దిగి తన మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించాడని బుధవారం రైల్వేకోడూరు ఎస్సై నాయక్‌కి నగిరిపాటి మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ నవీన్ అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించారని ఆరోపించారు. అలానే తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. మాదిగోల్లు ఎమ్మెల్యేగా ఎప్పుడైనా చూసినావా, ఎప్పుడైనా ఎమ్మెల్యే అయినారా అంటూ తూలానాడారంటూ చెప్పారు. బీదం నవీన్ అనే వ్యక్తిపై అలాగే అలాంటి వారిని ప్రోత్సహించే నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలిగల రాజా, వెమ్మడి రాదా క్రిష్ణ, నగిరిపాటి చంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుకు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు